నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, శుక్రవారం 31 జనవరి 2025 SANGAREDDY

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి



చేర్యాల మహాధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- ప్రజల మనోభావాలను గుర్తించాలి : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- చేయకుంటే కాంగ్రెస్ నాయకుల ఇండ్లు ముట్టడిస్తాం
- అఖిలపక్షం ఆధ్వర్యంలో మహాధర్నా, ర్యాలీ గ్రాండ్ సక్సెస్

చేర్యాల, జనవరి 30: సిద్దిపేట జిల్లా చేర్యాలను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయకుంటే ఊరుకునేది లేదని, ప్రజల మనోభావాలను గుర్తించి ప్రభుత్వం వెంటనే డివిజన్ ప్రకటించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చేర్యాలలో గురువారం రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్యపంతులు ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నా, ర్యాలీ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఈ సందర్భంగా మహాధర్నాలో బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రెవెన్యూ డివిజన్ ఏర్పాటును వెంటనే ప్రకటించకపోతే కాంగ్రెస్ నాయకుల ఇండ్లను ముట్టడిస్తామని, ఎక్కడిక్కడ నిలదీస్తామని హెచ్చరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా విజయం సాధించిన మొదటి అసెంబ్లీ సమావేశాల్లో చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశాన్ని సభ దృష్టికి తీసుకువచ్చానని, సీఎంతో పాటు మంత్రులకు వినతిపత్రాలు అందించినట్లు గుర్తుచేశారు. అన్ని పార్టీలు, వర్గాలు, ప్రజా సంఘాలు చేర్యాల రెవెన్యూ డివిజన్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ, ఎందుకు జీవో జారీ చేయడం లేదని ప్రశ్నించారు. తనను చేర్యాల ప్రాంత ప్రజలు అక్కున చేర్చుకుని ఎమ్మెల్యేగా గెలిపించారని, ఈ ప్రాంత ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, అన్నివర్గాల ప్రజల మనోభావాలకు అనుగుణంగా చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించేందుకు ఓ వైపు అసెంబ్లీలో, మరోవైపు ప్రజా పోరాటాల్లో పాల్గొంటానని తెలిపారు. కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ఉన్న వ్యక్తి ఇంకా ఓటమిని జీర్ణించుకోలేక ఇష్టారాజ్యంగా చేయకూడని పనులు చేస్తున్నాడని, లేనిపోని పంచాయితీలు చేస్తూ ప్రజలను, పార్టీలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని విమర్శించారు. పోలీసులతో అధికారం చెలాయిస్తామని అనుకోవడం అవివేకమని, పోలీసులు ప్రజలు కోరుకుంటున్న న్యాయం వైపు ఉండాలన్నారు. చేర్యాలను డివిజన్ కేంద్రంగా ప్రకటిస్తామని ఇచ్చిన హామీని సీఎం నిలబెట్టుకోవాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు జేఏసీ ఏర్పాటు చేసుకుని రెవెన్యూ డివిజన్ కోసం పోరాటాలు చేస్తున్నారని, ఇది ఎక్కడా లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి చిత్తశుద్ధి ఉంటే నేరుగా సీఎం వద్దకు వెళ్లి డివిజన్ ఏర్పాటు జీవో తీసుకురావాలని సూచించారు. చేర్యాల డివిజన్ కోసం శాసన మండలిలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కేపీఎల్ఎన్‌రెడ్డి మాట్లాడుతూ.. చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, ఈ విషయమై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అంతకుముందు చేర్యాలలోని గాంధీ సెంటర్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, ఒగ్గు రాజు, బూరుగు సురేశ్‌గౌడ్, భూమిగారి రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

చేర్యాల మహాధర్నాకు హాజరైన అఖిలపక్ష నాయకులు, ప్రజలు

ఎన్నికల కోసమే ప్రభుత్వం డ్రామాలు

- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్‌లో బైక్‌ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జనవరి 30: ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా ప్రజలను వంచించిన కాంగ్రెస్‌ను వదలపెట్టబోమని, బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలిచి అడుగడుగునా వెంటాడుతూనే ఉంటుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్ పట్టణంలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, వచ్చేవి ఏ ఎన్నికలైనా కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి
- 420 హామీలు అమలు చేయకపోవడంపై బీఆర్ఎస్ ఆగ్రహం
- మెదక్‌లో గాంధీ విగ్రహానికి వినతిపత్రాల అందజేత

బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి



మెదక్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు



మెదక్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 30: సాధ్యం కాని హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, తీరా హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేక పోయిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం మెదక్ జిల్లాకేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి తదితరులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారం కోసం కాంగ్రెస్ మాయమాటలు చెప్పిందని, అలవికాని హామీలిచ్చి ఇప్పుడు అమలు చేయకుండా డ్రామాలు ఆడుతున్నదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 రోజులు అవుతున్నదని, కానీ.. ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. రూ.4 వేల పింఛన్, తులం బంగారం, రైతుభరోసా రూ. 15 వేలు ఇలా అనేక హామీలను విస్మరించిందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రశ్నించే గొంతుకలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మెడలు వంచి హామీలు అమలు చేసేలా ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు నేరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు ప్రజల పక్షాన పోరాడుతుంటే తప్పుడు కేసులు పెడుతున్నారని ఆమె మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా పేదల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో అన్నివర్గాలకు మేలు జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలన మూడు దందాలు, ఆరు సెటిల్‌మెంట్లుగా కొనసాగుతుందని విమర్శించారు.

చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కారు

– ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై చేతులెత్తేసిందని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి విమర్శించారు. అధికారం కోసం మోసపూరిత హామీలిచ్చి, ఇప్పుడు పొంతన లేకుండా మాట్లాడడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలనే డిమాండ్‌తో ప్రభుత్వంపై ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తామని తెలిపారు. హామీలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం చేస్తున్నదన్నారు. కేసీఆర్ పాలనలో ఆత్మవిశ్వాసంతో వ్యవసాయం చేసిన రైతన్నలు, కాంగ్రెస్ పాలనలో ఆగమై పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, కరెంట్, సాగునీటి కోసం రైతులు ఎదురు చూసే పరిస్థితి ఏర్పడినట్లు తెలిపారు. కుట్రలు, కుతంత్రాలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలన కొనసాగిస్తున్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కో కన్వీనర్లు గడ్డమీది కృష్ణాగౌడ్, లింగారెడ్డి, మాజీ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, జయరాజ్, కిశోర్, రబ్బీ, చంద్రకళ, చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు అంజాగౌడ్, ప్రభురెడ్డి, బట్టి ఉదయ్, మేడిశెట్టి శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, శ్రీకాంత్, జుబేర్, మోచి కిషన్, అరుణ్, కిరణ్, శ్రీనివాస్‌గౌడ్, మధు, రాజు, నరేష్, వినోద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కారు అన్నింటా విఫలం

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌లో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 30: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీల అమలులో విఫలమైందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లోని కోర్టు సమీపంలో మహాత్మాగాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా విఫలమైందని విమర్శించారు. సీఎం, మంత్రులు ప్రజలను నయవంచనకు గురిచేస్తూ అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. పేదలకు రేషన్‌కార్డులు రావాలనే ఉద్దేశంతో కేసీఆర్ ఆనాడే ఆదాయ పరిమితిని సడలించారన్నారు. ప్రజలకు హామీ ఇవ్వకున్నా 4కిలోల బియ్యాన్ని 6కిలోలకు పెంచి అందించారని గుర్తుచేశారు. ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ నాయకులు బాండ్ పేపర్లు రాసిచ్చి, తీరా గెలిచాక మోసం చేశారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో జారీ చేసిన నోటిఫికేషన్లకు సంబంధించిన ఉద్యోగాలు తప్పా కొత్తగా ప్రభుత్వం భర్తీ చేసింది ఏమీ లేదన్నారు. వందశాతం రుణమాఫీ ఏ గ్రామంలో అమలు కాలేదని, రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలు, పాలనపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు బెండే మధు, నవాజ్‌మీరా, నాయకులు మల్లేశం, కృష్ణాగౌడ్, రమేశ్‌గౌడ్, జాఫర్‌ఖాన్, బాలమణి పాల్గొన్నారు.

హామీలపై కాంగ్రెస్ డ్రామాలు

జహీరాబాద్‌లో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

- జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, జనవరి 30: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 420 రోజులైనా ఆ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీల అమలు చేయడం లేదని, హామీలపై డ్రామాలు ఆడుతున్నదని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం జహీరాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారమే పరమావధిగా అమలుకాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పథకాల అమలుపై కాలయాపన చేస్తున్నదని దుయ్యబట్టారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలో ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయకుండా సీఎం మొదలుకొని మంత్రుల వరకు అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారని విమర్శించారు. అందుకే ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీలను అమలు చేసేలా సీఎంకు జ్ఞానోదయం కలిగించాలని గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, నర్సింహులు, సంజీవ్‌రెడ్డి, నాయకులు గుండప్ప, రామకృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, అల్లాడి నర్సింలు, తంజీం, నామర వికిరణ్, యాకుబ్, ప్రవీణ్‌కుమార్, రాజ్‌కుమార్, హీరురాథోడ్, బండిమోహన్, ఏజాజ్ బాబా, మచ్చేందర్, అబ్బుల్లా, చంద్రయ్య, చిన్నారెడ్డి, మోహన్‌రెడ్డి, రాజశేఖర్, నర్సింహులుగౌడ్, కరణ్, రియాజ్ పాల్గొన్నారు.

ప్రజలను వంచించిన కాంగ్రెస్

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాలలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జనవరి 30: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 420 రోజులు పూర్తి చేసుకుందని, కానీ, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం చేర్యాల పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో బీఆర్ఎస్ తరపున గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పల్లా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను వంచించిందన్నారు. అన్ని వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పెద్దలు ప్రజలకు మేలు చేసే విధంగా విజ్ఞత, బుద్ధి ప్రసాదించాలని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వంగ చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, రైతుబంధు మండల మాజీ కోఆర్డినేటర్ తాడెం రంజితాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనతో డ్యామేజ్

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డిలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 30: కాంగ్రెస్ పాలన తీరు మార్చుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ హితవు పలికారు. తెలంగాణను డ్యామేజ్ చేసేలా కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలతో కూడిన వినతిపత్రం మహాత్మాగాంధీ విగ్రహానికి సమర్పించామని తెలిపారు. అమలుకాని 6 గ్యారెంటీలు, 420 హామీలను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. నియోజవర్గంలో 86 గ్రామాలు ఉంటే, కేవలం 4 గ్రామాల్లో నాలుగు గ్యారంటీల అమలుకు నిర్ణయించి, అది కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. హామీల అమలుకు బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, టీఎన్‌జీవో మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు, డాక్టర్ శ్రీహరి, వెంకటేశ్వర్లు, మందుల వరలక్ష్మి, కొండల్‌రెడ్డి, చక్రపాణి, మధుసూదన్ రెడ్డి, వివిధ మండలాల మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహాన్ని శుభ్రం చేయకపోవడంపై ఆగ్రహం

గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శేరి సుభాష్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 30: మెదక్‌లో మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుభ్రం చేయకపోవడంపై మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరి 30న గాంధీ వర్ధంతి పురస్కరించుకుని మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో శుభ్రపరుస్తారు. ఈనెల 26తో పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో మున్సిపల్ అధికారులు శుభ్రపరచక పోవడంతో ఆయన మండిపడ్డారు. గాంధీ విగ్రహం వద్ద అపరిశుభ్రత కలిగి ఉండటంతో కోపోద్రిక్తులయ్యారు. దేశానికి అహింసా మార్గంలో స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన గాంధీ విగ్రహాన్ని శుభ్రపరచక పోవడం అవమానించడమే అని, మున్సిపల్ కమిషనర్‌తో పాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని బట్టి జగపతి డిమాండ్ చేశారు.

పనికిపోతే ప్రాణాలు పోయాయి

- మరో ఇద్దరు కూలీలకు తీవ్రగాయాలు
- గోవర్ధనగిరిలో ఉపాధిహామీ పనులు చేస్తుండగా ఘటన
- బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి : మాజీ మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి
- బాధిత కుటుంబాలకు మంత్రి పొన్నం, కేంద్రమంత్రి బండి సంజయ్, మాజీ ఎమ్మెల్యే సంతాపం

బండరాళ్లు, మట్టిమీద పడి తల్లీకూతురు మృతి

గోవర్ధనగిరిలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సతీష్ తదితరులు

సారవ్వ (ఫైల్)

మమత (ఫైల్)

అక్కన్నపేట, జనవరి 30: రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు... గుంట భూమి కూడా లేని నిరుపేద కుటుంబాలు వారివి..మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులతో పాటు కూలీ, నాలీ చేసుకుంటూ బతుకుతున్నారు. విధి ఆ కుటుంబాలను చిన్నచూపు చూసింది. రెప్పపాటులో జరిగిన ప్రమాదంలో బండరాళ్లు, మట్టిపెళ్లలు మీద పడడంతో పని చేసే చోటే తల్లీకూతురు దుర్మరణం చెందిన విషాదకర ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... గోవర్ధనగిరికి చెందిన కందారపు సారవ్వ (50), మల్లయ్య దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం. ఇందులో చిన్న కుమార్తె మమత (32)ను ఇదే గ్రామానికి చెందిన యోగేశ్వరచారికి ఇచ్చి పెండ్లి చేశారు. వీరికి కొడుకు రాఘవేంద్రచారి, కుమార్తె నిత్యమనుశ్రీ ఉన్నారు. ఇరు కుటుంబాలకు ఎలాంటి వ్యవసాయ భూమి లేకపోవడంతో గ్రామంలో కూలీ పనులకు తల్లీకూతురు కలిసి వెళ్తుంటారు. సారవ్వ భర్త మల్లయ్య హుస్నాబాద్‌లోని ఓ సామిల్‌లో పని చేస్తుండగా, వీరి అల్లుడు యోగేశ్వరచారి గ్రామంలోనే వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో నాలుగైదు రోజుల నుంచి గ్రామ సమీపంలోని సంజీవరాయుడి గుట్టకు ఉపాధిహామీ కూలీ పనులకు వెళ్తున్నారు. గురువారం ఉదయం ట్రాక్టర్‌లో గ్రామానికి చెందిన సుమారు 21మంది కూలీలు ఉపాధిహామీ పనులు చేసేందుకు వెళ్లారు. అక్కడ పని మొదలుపెట్టిన పది నిమిషాల్లోనే మమతపై బండరాళ్లు పడడంతో తల ఒకవైపు చిధ్రమైంది. సారవ్వ మీద మట్టిపెళ్లలు పడ్డాయి. వీరి పక్కనే పనిచేస్తున్న ఇంద్రాల స్వరూప, వల్ల బోజు మణెమ్మ కాళ్లు విరిగి తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ముగ్గురు కూలీలు తాటి కొండ విమల, ఇంద్రాల రేణుక, గౌడ వెంకటయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. జేసీబీ సాయంతో సారవ్వ మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటనా స్థలాన్ని హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో జయరాం పరిశీలించారు. ఘటనకు గల కారణాలను తోటి కూలీలను అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన స్వరూప, మణెమ్మను వరంగల్ ఎంజీఎంకు తరలించారు. స్వల్పగాయాలైన కూలీలను హుస్నాబాద్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స అందించారు. డీఆర్‌డీవో పీడీ జయదేవ్ ఆర్య, ఇతర అధికారులు హుస్నాబాద్ ప్రభుత్వ దవాఖానలో కూలీలతో మాట్లాడారు. సారవ్వ కుమారుడు శ్రీకాంత్, మమత భర్త యోగేశ్వరచారి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు.

హుస్నాబాద్ దవాఖానలో చికిత్స పొందుతున్న కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ

సంతాపం తెలిపిన మంత్రులు, మాజీ ఎమ్మెల్యే..

గోవర్ధనగిరిలో ఉపాధిహామీ కూలీలు మృతి చెందడం, పలువురికి గాయాలైన విషయం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ శాఖ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ప్రకటనలో సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ కోరారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలు, గాయపడిన వారిని దళిత బహుజన ప్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ పరామర్శించి, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఘటనపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు తప్పనిసరిగా జీవిత బీమా వర్తింపజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

బుధేరా పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సంజీవరావు

భారీగా గంజాయి పట్టివేత

మునిపల్లి, జనవరి 30: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న 32కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని, ఏడుగురిని రిమాండ్‌కు తరలించినట్లు సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు తెలిపారు. గురువారం మునిపల్లి మండలం బుధేరా పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని గణపతి జిల్లాకు చెందిన బికాస్ కుమార్‌మాలీ, రావుసాహెబ్ గెనాకాలే, దూకల్లె వసంత్ బాబురావు, హన్మంత్ రామదాస్ పవార్ ముఠాగా ఏర్పడ్డారు. వీరు ఒడిశా నుంచి